# ముసుగు

డా॥ జి. భాను

అరగంటసేపు అవిరళంగా కురిసిన వర్షం ఆగిపోయింది.

ఏ శక్తో తరుముతున్నట్లుగా మబ్బులు పరుగెత్తుతున్నాయి.

"అమ్మా ! అమ్మా ! ఎవరో కొత్త మనిషి వచ్చాడే. భలే ఉన్నా డనుకో. సుశీలాదేవిగారి ఇల్లు ఎక్కడా అని అడుగుతున్నాడు" అని పన్నిండేళ్ళ పావని చెప్పేటంతలో - "హలో సుశీలాదేవిగారూ, నేనండీ మనోహరరావును. రెండు దశాబ్దాల కిందటి క్లాసుమేటును. జ్ఞాపకం వచ్చానా? మన బి.ఏ. క్లాసులో వాగుడుకాయను" అంటూ ప్రవేశించాడు. అతను పిట్టల దొరలా ఉన్నాడు.

ఆశ్చర్యంలోనుండి తేరుకొని - "ఓ... మీరా? రండి... రండి. ఎంత కాలానికి చూశాను ! బావున్నారా?" అంది సంతోషంగా సుశీలాదేవి.

"బాగోగులు నిర్ణయించేది మనస్సు. అది బాగుంది. మీరు కులాసాగా ఉన్నారా?"

"ఆఁ... ఆఁ" అని నవ్వి, "కూర్చోండి" అని వరండాలో ఉన్న కుర్చీ జరిపింది.

మనోహరరావు తడిగా ఉన్న చెప్పుల్ని మెట్టుమీద వదిలి కూర్చున్నాడు. తలమీద కేప్ తీశాడు. నున్నని, తెల్లని బట్టతల మెరుస్తున్నది.

"ఖర్వాటుణ్ణి అయిపోయానండీ. ముప్ఫయి సంవత్సరాలు ఈ తలతో చెలిమి చేసిన జుట్టే తేలిగ్గా రాలిపోయింది. ఇక మధ్యలో సంబంధాలు మాత్రం శాశ్వతమా?" తల రుద్దుకున్నాడు.

"వంకీలు తిరిగిన జుట్టు కదా మీది. అంత ఊడిపోయిందే చిత్రంగా !"

"మీకు గుర్తుంది. అదృష్టం ఏమిటంటే తలలోని ఉషారు మాత్రం ఊడిపోలా. అదీ విశేషం."

"బావుంది. ఎక్కడున్నారు మీరు? ఏం చేస్తున్నారు? నేను ఇక్కడ ఉన్నట్లు ఎట్లా తెలిసింది?"

"నేను ఒరిస్సా స్టేట్‌లోనే వర్క్ చేస్తున్నా - ఆర్.టి.సి.లో సూపరింటెండెంట్‌గా. డిగ్రీ అవగానే మా బంధువువల్ల అక్కడే ఉద్యోగం వచ్చింది. మరింకెందుకని ఉండిపోయా. మీరు ఇక్కడ జె.ఎమ్.జె. కాలేజీలో ఉన్నారని మన క్లాసుమేట్ బాపిరెడ్డి విశాఖపట్నంలో కలిసినప్పుడు చెప్పాడు. మా స్వగ్రామం వేజండ్ల కదా. ఎప్పుడైనా వస్తుంటాను. అలా వస్తూ, దారిలో కాలేజీ దగ్గర బస్సు దిగి, మీ అడ్రసు కనుక్కున్నాను. దగ్గరున్న నాకు తెలిసిన క్లాసుమేట్ మీరే కాబట్టి ఒకసారి చూసిపోదామని వచ్చాను."

"నా సంతోషం మాటల్లో చెప్పలేను."

"నేనూ అంతేనండి. తిరిగి రాని తీపిరోజులు తేనెటీగల్లా జుమ్మంటున్నాయి జ్ఞాపకాల తేనెపట్టుల్లో."

"అవునండీ. నిజంగా అంతే."

"మన క్లాసుమేట్స్... అదే మన గ్రూప్‌మేట్స్ రామచంద్ర, ఈశ్వరరావు, బాపిరెడ్డి, రత్తయ్య, సూర్యనారాయణ, శారద, సూర్యకాంతం, రామారావు, శాస్త్రి ఎప్పుడైనా చుక్క తెగినట్లు కనబడేవారు. గత స్మృతుల్ని కదిలించి వెళ్తారు. మనస్సు అక్కడకు జారిపోతుంది. ఏమైనా అందరూ మంచి అంతస్తుల్లో, సుఖంగా, క్షేమంగా, ఆనందంగా ఉన్నందుకు సంతోషిస్తూ ఉంటాను."

"మనోహరరావుగారూ ! మీ వ్యక్తిగత విషయాలు చెప్పండి. పిల్ల లెందరు? ఏం చేస్తున్నారు? మీ శ్రీమతి ఉద్యోగం చేస్తున్నదా?"

"ఈ పరిచయ రంగంలోకి నన్నే ముందుగా దింపుతున్నా రన్నమాట. నా సంగతి తరువాత. ముందు మీ విషయం చెప్పండి. అందుకే ఇంత దూరం వచ్చింది. అందరి విషయాలూ కనుక్కోవాలన్న ఆసక్తే నా బలహీనత. దయచేసి మీరే ముందు చెప్పండి."

"సరే. ధాందేముంది ! నాకు ఇద్దరు పిల్లలు. పెద్దపిల్ల ప్రమోద బి.కామ్. చదువుతున్నది. సెకెండ్ ఇయర్ పరీక్ష రాసింది. టైపు, షార్టుహాండు పరీక్షలు పాస్ అయ్యింది. బాంక్ ఆఫీసర్ కావాలని దాని ధ్యేయం. అవసరమైతే ఒకరిమీద ఆధారపడకుండా స్వశక్తిని నమ్ముకోవాలి అంటుంది పెంకిపిల్ల. ఇక్కడే ఉన్న స్నేహితురాలు ఊరి కెళ్తుంటే వెళ్ళింది. ఇందాక మిమ్మల్ని తీసుకొచ్చిందే అది రెండోది. పేరు పావని. చూసి రమ్మంటే కాల్చి వచ్చే రకం. చింతచెట్లు ఎక్కుతుంది. మగపిల్లలతో గోలీలు ఆడుతుంది. సైకిల్ మీద స్వారీ చేస్తుంది. పది మంది పిల్లలపెట్టు. ఎనిమిదో తరగతి పాస్ అయ్యింది. ఇంటి పనులన్నీ చేస్తుంది బుద్ధి కుదిరితే."

"పిల్లలు బంగార మన్నమాట. ఈ పిల్లల తండ్రి... మీ భాగస్వామిని గురించి చెప్పండి."

'ఆఁ... నా భాగస్వామిని గురించి చెప్పనేలేదు. వారు ఢిల్లీలో ఓ ప్రయివేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. ఈ ప్రాంతాలకు... అదే హైదరాబాద్, మద్రాసు రావాలని ఎంతగానో ప్రయత్నాలు చేశారు గాని వీలుకాలేదు. పోనీ, నేనే వెళ్దామా అంటే నాదీ ప్రైవేట్ సర్వీస్ అయిపోయింది. ఇంకా పిల్లల చదువులు. అందుకని... ఇట్లాగే జీవితాన్ని కొనసాగిస్తున్నా."

"అమ్మా... అమ్మా... సుమతీ వాళ్ళ నాన్నగారు దానికి ఎంత చక్కని బట్టలు తెచ్చా రనుకున్నావ్. భలేగా ఉన్నా యనుకో" అన్నది పావని దూకుడుగా వస్తూ.

"తెస్తే... తెచ్చార్లే. అంతకన్నా మంచివి కొంటాగానీ, మా తల్లివి గదూ, మంచి టీ చేసుకొనిరా... అంకుల్‌తో మాట్లాడుతున్నా గదా !" సముదాయించి, పురమాయించింది.

"ఇకపోతే, వారు ఎంతో మంచివారు. నేనంటే చెప్పలేనంత ప్రేమ, మమకారం, అభిమానం వారికి. పిల్లలంటే ప్రాణం. 'నువ్వూ, పిల్లలూ లేకుండా ఇంత సుదూరతీరాల్లో ఉండడం వల్లకాదు బాబోయ్' అని ఉత్తరాల్లో ఒకటే ఇదిగా రాస్తుంటారు. సెలవు దొరికితే చాలు రెక్కలు కట్టుకొని వచ్చేస్తారు. మమ్మల్ని విడిచి వెళ్ళాలంటే విలవిలాడిపోతారు. ఒక్కోసారి ఎందు కీ బతుకు, ఉద్యోగం అనిపిస్తుంది. చూస్తూ చూస్తూ ఉద్యోగం వదులుకోలేం. వారేమో నా సమస్తం ఇక్కడుంది. వట్టి బొంది మాత్రం అక్కడుంది అని అంటుంటే ఓ పక్క ఆనందం, ఓ పక్క విషాదం కలగలువుగా ఎదలో మెదులుతుంటాయి. అయినా ఇది జీవితం. ఏదోవిధంగా రాజీ పడాలి. బతకాలి. ఏమంటారు?"

"అనే దేముంది కాని సుశీలగారూ, మీది ఆదర్శమైన సంసారం. ప్రేమించే భర్త, బంగారం లాంటి పిల్లలు - మీవారి పేరు చెప్పలేదు."

"పేరు... పరమేశ్వరరావుగారు."

"ఓహో... పరమేశ్వరుడు. మీ పేరు సుశీల. మీది అన్యోన్యమైన దాంపత్యం. నా మనస్సు ఆనందంతో పొంగిపోతున్నదంటే నమ్మండి."

"అమ్మా... టీ..." అని పావని రెండు కప్పులు తెచ్చి, ఒకటి తల్లికీ, ఇంకొకటి మనోహరరావుకూ అందించింది.

టీ సిప్ చేసి మనోహరరావు పావనిని తెగ మెచ్చుకున్నాడు. తల్లి కన్నులు మెరిశాయి. పావని ఉబ్బిపోయింది.

చూరునుంచి ఉండుండి నీటిచుక్కలు రాలలేక రాలుతున్నాయి. నీటి గుంటల్లో పిచికలు స్నానం చేస్తున్నాయి ఉత్సాహంగా.

"సుశీలగారూ, నా విషయం చెప్పాలి గదూ ! నా వైవాహిక జీవితం కూడా మీ జీవితం వంటిందే. నేను దురదృష్టవంతుణ్ణి కాదనే చెప్పుకోవాలి. నేను, రజని ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాం. అందర్నీ ఎదిరించి, తెగించి, ఛాలెంజీగా తీసుకొని మరీ పెళ్ళి చేసుకొన్నాం. దాని ఫలితాలు జీవితంలో అనుభవించాం. జీవిత ప్రయాణంలో ప్రతికూల పవనాలు వీచినా, ప్రతీపశక్తులు ఎదురైనా, అవరోధాలు అడ్డుకొన్నా అవలీలగా ఎదుర్కొన్నాం కానీ, నిరాశా నిర్లిప్తలకు లోనుకాలేదు. నిస్సహాయంగా దిక్కులు పరికించలేదు.

"నాకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని, వాకిట్లో రంగవల్లిలాగా కాపుండే నా అర్థాంగి నా కలల కల్పవల్లి. నా నయనాల కర్పూరవల్లి. ముచ్చటైన ఇద్దరు పిల్లలతో నా సంసారస్యందనాన్ని నడిపించే సారథి నా అర్థాంగి రజని. ఇదీ నా సంగతి. జీవితంలో దిగులు బరువులు, అసంతృప్తి తరుగులు లేకుండా గాలిపటంలా ఉన్నా ననుకోండి" అని చిద్విలాసంగా నవ్వాడు మనోహరరావు.

సుశీల కన్నుల్లో నుంచి ముత్యాలవంటి ఆనందాశ్రువులు జారిపోయాయి. ఆమె పెదాలు బిగబట్టుకొని తీయని ఏడ్పును ఆపుకొన్నది.

"మీదెంత మధుర జీవితం ! కల కన్నా కల్పన కన్నా మిన్నగా ఉంది."

ఆ మాట మనోహరరావు హృదయ కుహరంలో ప్రతిధ్వనించింది కాబోలు, అతను తన్మయంతోనో, విస్మయంతోనో కన్నులు మూసుకొన్నాడు. చెమ్మగిల్లాయి అతని కళ్ళు.

"ఇక బయలుదేరుతాను. బెజవాడ వెళ్ళి ఓ మిత్రుణ్ణి చూసి రావాలి. మీవారు ఉండగా మళ్ళొస్తాను. పావనీ ! వస్తానమ్మా" అని బయలుదేరాడు.

"పావనీ ! మిల్లు దగ్గర విశాలాక్షి దగ్గరకు వెళ్ళిన అక్క ఇంకా రాలేదు. పిల్చుకురా తల్లీ !" అని సుశీల అంటూ గుమ్మం దగ్గరదాకా వచ్చి సాగనంపింది చిరకాల మిత్రుణ్ణి.

** ** **

తెనాలి రైల్వే స్టేషన్‌లో అరగంట లేటుగా వచ్చిన రైలుబండిలో కిటికీ పక్కన కూర్చున్నాడు మనోహరరావు.

కాఫీ, టీ అమ్మేవాళ్ళతో కోలాహలంగా ఉంది వాతావరణం.

ఆ రోజు ఏ కారణంచేతనో బండిలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా లేదు. కిటికీలో నుంచి చూస్తున్న అతని కంటికి పావని కనబడింది. పావని పక్కన పద్దెనిమిదేళ్ళ యువతి ఉంది. ఎవర్నో బండికి ఎక్కించి, వెళ్ళడానికి అటు వస్తున్నట్లుగా ఉన్నారు.

"పావనీ !" పిల్చాడు.

"హలో అంకుల్ !" అని పరుగెత్తుకొంటూ వచ్చింది. అక్క స్నేహితురాలు విశాలాక్షి వైజాగ్ వెళ్తూ ఉంటే సాగనంపడానికి వచ్చామని చెప్పింది. అంతలో పావని అక్క అక్కడకు వచ్చింది. మనోహరరావే మాట్లాడాడు.

"ఏమ్మా ప్రమోదా ! నేను, మీ అమ్మగారు కలిసి చదువుకొన్నాం ఇరవై సంవత్సరాల కిందట. ఇందాక మీ ఇంటికి వచ్చాను చూద్దామని. అప్పుడు నువ్వు లేవు. ఇప్పుడు సాగనంపడానికి వచ్చిన స్నేహితురాలి ఇంటికి వెళ్ళావట. నిన్ను గురించి మీ అమ్మ చాలా చెప్పింది. నేను సంతోషిస్తున్నానమ్మా. బాంక్ ఆఫీసర్ కావాలనే నీ ధ్యేయాన్ని అభినందిస్తున్నా. మీ నాన్నగారు కూడా చాలా ముచ్చట పడిపోతున్నట్లు మీ అమ్మ మురిసిపోతూ చెప్పింది."

"అక్కా ! మంచినీళ్ళు తాగి వస్తానక్కా" అంటూ పావని వెళ్ళింది.

"ఇంతకీ నువ్వు మీ నాన్నగారి పోలికే ననుకొంటాను. అదృష్టవంతురాలి వవుతావు. మిమ్మల్ని కనుపాపల్లా చూసుకొనే మీ అమ్మ, ప్రాణంలా భావించే మీ నాన్న. జీవితంలో ఇంకేం కావాలమ్మా?" ఉత్సాహంగా అన్నాడు మనోహరరావు.

"అంకుల్, మీ అభిమానానికి థాంక్స్. అమ్మ అంతా చెప్పింది కదూ !"

"అవునమ్మా. అంతా చెప్పింది. ఆనందంతో పొంగిపోతూ చెప్పింది. ఢిల్లీలో ఉన్నా ప్రాణాలన్నీ మీపైనే పెట్టుకొన్న మీ నాన్న నైజం, మీ అమ్మను ప్రేమాదరాలతో చూసుకొనే ఆయన స్వభావం - చాలా గొప్పగా చెప్పింది. ఆ విషయాలు విని నేను ముగ్ధుణ్ణయిపోయాను. జీవితం సార్థక్యం పొందడం అంటే అదే ! ఒక్క ముక్కలో చెప్పాలంటే నా ఎడారి గుండెలో వర్షపు తెర కురిసినంత సంబరపడిపోయానంటే నమ్ము తల్లీ

మనోహరరావు గొంతు గద్గదికమైంది.



గంట కొట్టారు. గార్డు విజిల్ ఊదాడు. పబ్లిక్ సౌండ్ సిస్టంలో నుంచి బండి బయలుదేరుతున్నట్లు చెప్పారు. కంపార్టుమెంటులో ఎక్కే ప్రయాణికులు తొందరపడిపోతున్నారు.

"అమ్మా ప్రమోదా ! మళ్ళీ వస్తాను. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్."

"అంకుల్, అమ్మ చెప్పిందంతా అబద్ధం - కల్పన ! పది సంవత్సరాల కిందటే అమ్మను వదిలేసి, ఇంకో మనిషితో ఉంటున్నాడు హైదరాబాదులో మా నాన్న. ఆమె అందగత్తెట. కుమిలిపోతూ, క్రుంగిపోతూ, కృశించిపోతూ బ్రతుకు ఈడుస్తున్న అమ్మ తన కృత్రిమ సంతృప్తికోసం, ఆభాసానందంకోసం, ప్రియమైన అసత్యాలు చెప్పి తన నిరాశా జీవితానికి రంగు వేసుకొంటున్నది. అమ్మా, మేమూ దగాపడ్డ జీవులం, దురదృష్టవంతులం అంకుల్ ! ఇది కఠోర సత్యం !" కదులుతున్న బండితో పాటు నడుస్తూ చెబుతున్నది ప్రమోద.

"అమ్మా ప్రమోదా ! ఎంత ఘోరం జరిగింది తల్లీ ! మీ అమ్మ కూడా విధివంచితే అన్నమాట. ఇక ఆగిపో. జాగ్రత్త !" అన్నాడు మనోహరరావు. అతని పెదాలు ఎండిపోయాయి.

రైలుబండి ప్లాటుఫారం దాటింది.

"అయ్యో సుశీలా ! నువ్వు కూడా నావంటి దానవేనా?" పైకి అనేశాడు మనోహరరావు. వింతగా చూశారు పక్కన ఉన్న ప్రయాణికులు. అతని అంతరంగంలోని మల్లిపొదలు, చందన తరువులు తగలబడిపోతున్నాయి.

అవిరళంగా కన్నీరు స్రవిస్తున్నది మనోహరరావు కన్నుల్లోనుంచి. అది మునుపటి భాష్పాలు కావు. గుండె లోలోతుల్లో నుంచి పైకి ఎగసిన ఆవేదనా ఝురులు. ఆ ఝురుల్లో పన్నెండు సంవత్సరాల కిందట తాను ఎంతగానో ప్రేమించి, సర్వస్వం సమర్పించి, ఆరాధించినా తనను దగాచేసి, ఇంకో వ్యక్తితో పరారైన రజని రూపం మెరిసింది.

రైలు శబ్దం చేస్తూ వేగం పుంజుకొంది. ఆ శబ్దంతో రకరకాల వేదనామయ నాదాలను సమన్వయించుకోవచ్చు. ★